
ప్రకాశరావు ట్రెయిన్ దిగి హుషారుగా నడుస్తూనే గేటు దగ్గరికి వచ్చీరాకుండానే "రిక్షాబాబూ" అంటూ రిక్షావాళ్ళు అతన్ని చుట్టుముట్టారు. ఎవరికి వారు అతని సూట్‌కేస్ లాక్కునే ప్రయత్నం చేశారు.




"రండి బాబూ!"

ఓ రిక్షావాలా అతని చేతిలోంచి సూట్‌కేస్ లాక్కోనేలాక్కున్నాడు. అతని చొరవకి ప్రకాశరావు కొంచెం ఆశ్చర్యపోయి, "బహుశా, తెలిసినవాడయి వుంటాడులే" అనుకొని సరిపెట్టుకొని, టిక్కెట్టిచ్చి అతని వెంట నడిచాడు.

"ఎక్కండి బాబూ!" సూట్‌కేస్ రిక్షాలో పెట్టి ప్రకాశరావుని ఆహ్వానించాడు రిక్షావాలా సవినయంగా.

ఎక్కడికని అడగలేదు. బేరం లేదు. తప్పక తెలిసిన వాడయే వుంటాడనుకున్నాడు ప్రకాశరావు. సవిలాసంగా రిక్షా ఎక్కాడు. రిక్షా పోతూంది.

"యాడకి బాబూ?"

ప్రకాశరావు తెల్లబోయాడు.

"కొత్తపేట, గుడి వీథి."

"చివరికెళ్ళాల్నా బాబూ?"

"ఊఁ"

తెలిసినట్టు ఆహ్వానించి బేరం కూడా అడక్కపోతే ఏమోననుకొన్నాడు. బాడుగకి పేచీ పెడతాడేమో! చూస్తే వ్యవహారం అలాగే వుంది. ఇదో టెక్నిక్. పోన్లే, కొంచెం ఎక్కువిస్తే ఇవ్వొచ్చు. పేచీ ఎందుకు! ప్రకాశరావు చాలా ఉత్సాహంగా వున్నాడు. వెళ్ళిన పనైంది. కాంట్రాక్టు దక్కింది. మనసు ఆఘమేఘాల మీద పోతోంది ఎక్కడెక్కడికో. ఏవేవో భావాలు - వాటికేం, బాడుగా, గీడుగా చెల్లించాలా ఏమన్నానా?

రిక్షావాలా రిక్షాని బహు జాగ్రత్తగా, నెమ్మదిగా పోనిస్తున్నాడు.

ప్రకాశరావుకి విసుగ్గా వుంది.

"కాస్త వేగంగా పోనియ్యవోయ్" అన్నాడు.

"రోడ్డు బాగాలేదు బాబూ!"

"ఆ — ఏదో చెప్తావు, అన్ని రిక్షాలూ పోతూండ డంలే—"

"రిక్షా గతుకుల్లో పడితే ఇంకేంటుంటది బాబూ?"

"ఏం పరవాలేదు. ఆ మాత్రం తట్టుకోగలనులే."

"అది కాదు బాబూ, రిక్షా పాడవుద్ది."

ప్రకాశరావుకి కొంచెం కలుక్కుమంది.

"ఓహ్! అంత ఓడయితే నువ్వేం చేస్తావు? ఓనర్ బాగుచేయించుకొంటాడులే."

"బండి నాదే బాబూ!"

"నీదా?"

"చిత్తం" కులుకుతూ అన్నాడు రిక్షావాలా. అతని మాటల్లో ఓ విధమైన గర్వం, తృప్తి ప్రకాశరావు గమనించాడు.

"ఆ హా !" అన్నాడు ప్రకాశరావు ప్రశంసిస్తున్నట్టుగా.

"కొత్తదే బాబు. ఓడు కాదు. ఇవాళ్టికి బాబూ, సరిగా సంవత్సరమయింది కొని."

"బాగుందోయ్. సొంత డబ్బేనా, అప్పా?"

"నాకాడ ఏడుంటుంది బాబూ? బాంకు అప్పు బాబూ"

"ఎంతేమిటి?"

"పందొమ్మిదొందలంట బాబూ! అయితే నెలకి ఎనభై కాడికి సంవత్సరం కడితే చాలన్నారండి. మిగతాది అక్కర్లేదంట."

"సంవత్సరమైందిగా. పూర్తిగా చెల్లించేశావా?"

"బాబూ! కరెక్టుగా పదకొండు మాసాలు చెల్లించా నండి. ఈ పన్నెండోది కట్టలేనండి. బకాయిపడతా బాబూ!"

"ఏం?"

"బండి కొన్నకాడి నించీ మాంచి ఉషారు మీద నడిపి సంపాయించినా బాబూ. అసలు పది నెల్లకే మొత్తం అయిపోయుండాలిసింది. జబ్బుపడి ఓ నెల బండి నడపలేదు బాబూ!"

"అలాగా పాపం. బాగా కష్టం చేసి వుంటావు. దెబ్బ తీసింది."

"ఆ ఊపు అట్టాంటిదండి. బాంకోరు తెగ మెచ్చు కొన్నారు బాబూ. ఇంత టంచన్‌గా కట్టినోళ్ళు లేరన్నా రండి. ఏం లాబం, ఈ నెల మాట బోయె" అతని స్వరంలో దైన్యం ప్రస్ఫుటమైంది. ప్రకాశరావుకి చప్పున ఓ ఊహ కలిగింది. ఈ వాయిదా డబ్బు తనిస్తే! అతనెంత సంతోషపడతాడు. తన పట్ల ఎంత కృతజ్ఞత ప్రకటిస్తాడు! పోతే పోతై ఓ ఎనభై. అది తనకో లెక్కా. వేలకి వేలు సంపాదిస్తున్నాడు. "నే నిస్తానులేవోయ్" అనే మాట నోటిదాకా వచ్చింది. ఊహు అలా చెప్పి ఇవ్వకూడదు. బండి దిగగానే ఎనభై రూపాయలు — ఎనిమిది నదులు రెపరెపలాడిస్తూ "తీసుకోవోయ్, ఏమిటలా చూస్తావు -, వాయిదా కట్టేసెయ్యి. ఇవాళ్టి ఈ బాడుగ ఎనభై రూపాయలు - ఊఁ తీసుకో" అంటూ అతని చేతిలో పెట్టాలి. ఓహ్. జీవితంలో ఇలాంటి పనెప్పుడూ తను చెయ్యలేదు. ఆ క్షణాన అతను ఉక్కిరిబిక్కిరైపోతూ తన వైపు కృతజ్ఞతతో చూస్తుంటే ఎంత థ్రిల్లింగ్‌గా వుంటుంది.

"నీ పేరేమిటోయ్?" అన్నాడు ప్రకాశరావు ఆలోచనల్ని ఆపి.

"రాముడండి."

"రాముడూ, అయితే నువ్వు బాగా సంపాదించేవాడి వన్న మాట."

"సంపాయించకేం బాబూ! రిక్షా కొన్న తరువాత నా జీవితమే మారిపోయిందండి. కాయిలా పడ్డాగాని, లేపోతే ... ఇప్పుడైతేమటుకేంలెండి బాబూ, ఆరోగ్గెం కుదుటబడ్డదిగా - ఇంక సంపాయించ కూరుకుంటావా! బాకీ తీర్చేసి — నా సామిరంగా..." ఏం ధీమాగా మాట్లాడుతున్నాడు!

# స్వప్న హస్తాలు



శూన్య స్థలాలు మనల్ని ఆవరిస్తాయి, ఆవహిస్తాయి
శూన్యహస్తాలు చెట్లమొలిచి మనమధ్య లేస్తాయి
శూన్య ప్రదాలు మనవోళ్ళ విపరీతంగా సుళ్ళుతిరిగిపోతాయి
చూపు కందినంత మేరా రిక్తఆసనాలు అస్తవ్యస్తంగా పడిపోయి వుంటాయి
ఒక పచ్చని పార గాలిలో తేలుతూ ఏవో భ్రమల అలల్ని కదుపుతూ వుంటుంది
టేబుళ్ళమీద శూన్యపాత్రలు శూన్య దృక్కులు శుద్ధ పాతివ్రత్యాలు
ఇళ్ళలో మాత్రమే కనపడే ఏకపత్నీ వ్రతాలు చాలా గలీజుగా కలిసిపోయి
వెక్కిరిస్తాయి
చివిగిన నోటు శవంగా ప్రతిక్షణం ఎదిగి ఎదిగి నన్ను దిగమింగేస్తుంది
అద్దాల్లోంచి కనపడే వీధి దీపాల నీటి బొట్లూ
చెట్ల ఆకులమీద జారిపడుతున్న ఆడదాని లేత చర్మం విహ్వాలత్వం
అదృశ్య సమాధుల మీద మొలుస్తున్న ఆంతరంగిక జ్ఞాపకాల తోలు సంచులూ
మొలతాడుకు వేళ్ళాడుతున్న చిల్లికానీ చిన్నతనం లొట్టకన్నూ
శుద్ధ అపరిపక్వ శబ్దాల గొడ్డుమోత్తనం
గూట్లో దాచిన చీకట్లో తేలుకొండీల చిల్లరతనం

* * *

నీళ్లు రాళ్ళవుతున్నాయి, రక్తం మూత్రమవుతుంది
ఎవడో ఒకడి వజ్రపుటుంగరంమ్మీద భూమి ఒక బొంగరం

* * *

ఎవడైనా వాడి శవంతో మాట్లాడినప్పుడే శూన్యం పుడుతుంది
ఎవడికళ్లు వాడే పొడిచేసుకున్నప్పుడు నిర్భేద్యమైన శూన్యం పుడుతుంది
ఎవడి ఏకాకితనం వాడి జీవన వ్యవసాయం అవుతుందో
వాడి శరీరం మొత్తం ఒక శూన్య గహ్వరం అవుతుంది
నిజమే కాళ్ళు లేని చెప్పులు శూన్యంగా ఉంటాయి
కానీ చెప్పులు లేని కాళ్ళు శూన్యంగాదు
నిజమే ఎడ్లులేని కాడి శూన్యంగా వుంటుంది
చేతుల్లేని పలుగూ శూన్యంగా వుంటుంది.
కానీ ఎడ్లు శూన్యంగాదు, చేతులు శూన్యంగాదు
శూన్యంగాని ఎడ్లున్నప్పుడు, బండీ వస్తుంది, నాగలీ వస్తుంది, పంట పొలాలూ
వస్తాయి
శూన్యంగాని చేతులున్నప్పుడు పలుగులూ, పారలూ, కత్తులూ,
కలాలు, కాగితాలూ వస్తాయి.
ఒక అమేయ సౌందర్య సఫల జీవితాన్ని ఆశించే చేతులు
రిక్తహస్తాలు కావు, స్వప్న హస్తాలు, సాయుధహస్తాలు

కె. శివారెడ్డి

"వాయిదా మొత్తానికి ఎంత తక్కువైందంటావు?"

"ఓ యాభై తగ్గుద్ది బాబు!"

"ఎక్కడైనా అప్పు తీసుకోరాదు మరి. సకాలంలో వాయిదా చెల్లిస్తే బాగుంటుందిగా."

"ఎవురిస్తారు బాబూ?"

"నేనిస్తాను. అప్పు కాదు. ఊరికే" అనాలనిపించింది ప్రకాశరావుకి. తమాయించుకొన్నాడు. ఎనభై ఇవ్వాలా, ఏభై ఇవ్వాలా అని ఆలోచించాడు. అతనికి కావలసింది ఏభై మాత్రమే గదా!

"ఖర్చు బాగా ఎక్కువా?"

"ఎక్కువంటే, కొంచెం ఎక్కువే బాబూ!"

"ఏం? తాగుడు గీగుడు వుందా?"

"ఛ, ఛ, అట్టాంటోటి జోలికి ఎప్పుడూ పోయేది లేదు బాబూ. ఆ మద్దెని పెళ్ళి చేసుకొన్నా - మరి కర్చే గదండి... ఓళీగీళీ..."

"ఆ ఆ " అన్నాడు ప్రకాశరావు. అతనికి వెంటనే ఓ ఊహ కలిగింది. ఓళీఇచ్చి పెళ్ళి చేసుకోడానికీ, ఇంటి ఖర్చుకీ, జబ్బుకి వైద్యానికీ, బాకీ తీర్చడానికీ సరిపడ్డంత సంపాదనా ఇతగాడిది! ఆ హా!

"అంతా రిక్షా కొన్న ఏళాఇశేషం బాబూ. ఇది కొన్నప్పటి నించే నా దశ తిరిగిందండి. అందుకే బాబూ, కట్టాలిసిన వాయిదా కట్టలేకపోతున్నానే అని ఇచారం."

అతని విచారానికి ప్రకాశరావుకి జాలేసింది. అయితే, అతనేం పేద మాటలు మాట్లాడడం లేదు. మాంచి ధీమా వుంది. మరి తను డబ్బు ఇవ్వడం అంత సవ్యమా? అందులో ఔచిత్యం వుందా? తనకి డబ్బు విలువ తెలీదనుకోడు గదా! డబ్బు పోయి, శనీ పట్టినట్టు! ఏమైతే ఏం, ఓ పాతిక చేతిలో పెడితే.. అంత ఎక్కువ కాదు - తక్కువ కాదు. తనకి ఇవాళ చాలా ఉత్సాహంగా వుంది. ఇతనూ చాలా మంచివాడుగా కనిపిస్తున్నాడు.

"దానికంత విచారమెందుకోయ్? ఎగ్గొట్టేవాళ్ళు ఎగ్గొట్టగాలేంది..."

"అదేంటి బాబూ, తమరట్టా మాట్టాడతారు? ఎగ్గొట్టేవాడి ముక్కులిరగదన్నాల. తనకి రావలసింది వొదుల్తాడా అట్టాంటోడు? ఇతర్లకివ్వాలిసిందట్టా గాదా? బాబూ, బాకీ లెగ్గొట్టేవోళ్ళు, కూల్డబ్బు లెగ్గొట్టే వాళ్ళు, వాటా లెగ్గొట్టేవోళ్ళు, పన్నులెగ్గొట్టేవోళ్ళు - ఇట్టాంటోళ్ళున్నారే - ఈళ్ళని సట్టీగ్గా చెట్టుక్కట్టి కొరడా దెబ్బలు కొట్టాల, జైల్లో తొయ్యాల, గాడిదల మీద ఊరేగించాల..." రిక్షావాలా ఉద్రేకంగా ఏమేమో అంటున్నాడు. అకస్మాత్తుగా ప్రకాశరావుకి అతని మీద సదభిప్రాయం తొలగిపోయింది. ఇత నేమిటి హింసా వాది, దౌర్జన్యవాదిలా వున్నాడు. అసలురంగు బయట పడుతోంది. తనేమిటో మంచివాడనుకొన్నాడు. బేరం మాట్లాడకుండా ఎక్కాడు. బహుశా, తన దగ్గర్నించి జమాయించి ఎక్కువ వసూలు చేస్తాడు. బేరం మాట్లాడకుండా ఎక్కడం పొరపాటే.

"చివరదాకా పోవాలా బాబూ!"

"ఆ " అతని మాటల్లో ప్రకాశరావుకి వసుగుడు వినిపించింది.

రిక్షా ఆగింది.

"ఎంత?" అని అడిగితే ఎంతంటాడో! రెండున్నర బాడుగ. పోనీ మూడు రూపాయలిద్దాంలే అనుకొని జేబులోంచి మూడు రూపాయలు తీసివ్వబోయాడు ప్రకాశరావు.

"ఒద్దండి" అన్నాడు రిక్షావాలా!

"ఒద్దా! అసలు మీ రిక్షావాళ్ళతో ఇదే పేచీ. రెండున్నర బాడుగకి మూడిచ్చినా చాలదా! బేరం చెయ్యకుండా ఎక్కడం నాదే బుద్ధి పొరపాటు. ఎంతివ్వ మంటావు?" అన్నాడు ప్రకాశరావు చిటచిటలాడుతూ.

"అది కాదు బాబూ! రిక్షా కొని ఇయ్యాల్టికి సంవత్సర మైందని చెప్పాను గదండి. నా సంతోషం కొద్దీ ఇయ్యాల్టి మొదటి బాడుగ పుచ్చుకోవద్దనుకున్నా బాబూ, దయుంచండి" అన్నాడు రిక్షావాలా రిక్షాలో సీటు సరిచేస్తూ.

---

లెక్చరర్ సత్యమూర్తి క్లాసులోకి రాగానే చెప్పాడు.

"ఈ రోజు నేను అబద్ధాలకోరుల మీద పాఠం చెప్పబోతున్నాను. మీలో ఇరవై అయిదో ఛాప్టర్ ఎంత మంది చదివారు?"

క్లాసులో దరిదాపు అంతా చేతులెత్తారు.

"వెరీగుడ్. నేను మాటాడదలచుకుంది మీలాంటి వారితోనే. ఎందుకంటే ఇరవై అయిదో ఛాప్టర్ అసలు లేదు గనుక" చెప్పాడు సత్య మూర్తి.

*-వై. విజయ, విజయవాడ.*